సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
శుక్రవారం। 22। సెప్టెంబర్। 2023



సోమశిలలో 22.658 టీఎంసీలు

చేజర్ల(సోమశిల): సోమశిలలో గురువారం నాటికి 22.658 టీఎంసీలు ఉన్నాయి. పెన్నార్ డెల్టాకు 500, ఉత్తర, దక్షిణ కాలువలకు 364 క్యూసెక్కులు వదలుతున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	రూ.61,000
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,496
3శాతం జీఎస్టీతో	రూ.5,661
సవర (8గ్రా)	రూ.45,288

వాతావరణం

గరిష్టం/కనిష్టం
33.5 /28.5

గురువారం గాలిలో 59 శాతం తేమ ఉంది. శుక్రవారం వాతావరణం వేడిగా ఉంటుంది. మధ్యాహ్నం నుంచి అక్కడక్కడ చిరుజల్లులు పడే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

గణేశ్ లడ్డూ @ రూ.1.32 లక్షలు



లడ్డూను దక్కించుకున్న ముసలయ్య

ఆత్మకూరు: పట్టణంలోని నారాయణరావుపేటలో ఏర్పాటు చేసిన గణేశ్ విగ్రహం వద్ద లడ్డూ ప్రసాదం వేలం పాటను గురువారం నిర్వహించారు. పోటాపోటీగా సాగిన వేలంలో స్థానికుడైన ముసలయ్య కుటుంబ సభ్యులు రూ.1,32,001కు లడ్డూను దక్కించుకున్నారు. అనంతరం లడ్డూ ప్రసాదాన్ని భక్తులకు పంచిపెట్టారు.

వైఎస్సార్‌సీపీ న్యాయవిభాగ జోనల్ ఇన్‌చార్జిగా రోజారెడ్డి

నెల్లూరు (లీగల్): వైఎస్సార్‌సీపీ న్యాయవిభాగ జోనల్ ఇన్‌చార్జిగా రామిరెడ్డి రోజారెడ్డి, జిల్లా విభాగ అధ్యక్షుడిగా వై మురళీధర్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

24న సాఫ్ట్‌బాల్ జట్ల ఎంపికలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఈనెల 24న నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో జిల్లా సాఫ్ట్‌బాల్ సీనియర్ పురుష, మహిళా జట్ల ఎంపికలు నిర్వహించనున్నట్లు జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మలిరెడ్డి కోటారెడ్డి, సీహెచ్ కామేశ్వరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన జట్లు అక్టోబర్ మొదటి వారంలో కర్నూలులో జరిగే పదో సీనియర్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో పాల్గొంటాయని చెప్పారు. ఆసక్తి గల క్రీడాకారులు ఒరిజినల్ ఆధార్‌కార్డు, ఆరు పాస్‌ఫొటోలతో ఉదయం పది గంటలకు ఎంపికలకు హాజరుకావాలని కోరారు. వివరాలకు 97036 54315, 80742 99670 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

నేడు చేజర్లలో 'జగనన్నకు చెబుదాం'

నెల్లూరు(దర్గామిట్ట): ఆత్మకూరు నియోజకవర్గంలోని చేజర్ల మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కలెక్టర్ హరినారాయణన్ గురువారం తెలిపారు. జిల్లా, మండల స్థాయి అధికారులు హాజరై ప్రజా సమస్యలపై అర్జీలు స్వీకరిస్తారని చెప్పారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామస్థాయిలోనే సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేకంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

రాష్ట్ర ప్రభుత్వ పింఛనర్ల సమావేశం రేపు

నెల్లూరు(బృందావనం): రాష్ట్ర ప్రభుత్వ పింఛనర్ల సర్వసభ్య సమావేశాన్ని భక్తవత్సలనగర్‌లోని పింఛనర్ల సంక్షేమ భవనంలో శనివారం సాయంత్రం నిర్వహించనున్నామని అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గౌస్, ఎస్వీపీఎస్ మూర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దంత సంరక్షణపై సూచనలు, సలహాలతో పాటు పరీక్షలను ఇందిర మల్టీ స్పెషాల్టీ దంత వైద్యశాల అధినేత వివేకానందరెడ్డి నిర్వహించనున్నారని చెప్పారు.



ఉద్యోగ విప్లవం!

- ఉమ్మడి నెల్లూరు జిల్లాలో 78 జాబ్‌మేళాల నిర్వహణ
- 4,600 మందికి ఉద్యోగాల కల్పన
- ఆత్మకూరులో ప్రత్యేకంగా జాబ్‌మేళాలు
- స్థానిక ఎమ్మెల్యే మేకపాటి చొరవతో 300 మందికి ఉద్యోగాలు
- మరో 500 మందికి ఉపాధి కల్పనకు సెంచూరియన్ కంపెనీతో ఒప్పందం

ఉమ్మడి నెల్లూరు జిల్లా పరిశ్రమలకు ఖిల్లాగా మారింది. సువిశాలమైన తీరం, భారీ పోర్టు, ప్రత్యేక ఆర్థిక మండళ్లతో పారిశ్రామిక హబ్‌గా మారింది. దీంతో జిల్లాలో పారిశ్రామిక రంగ పెట్టుబడులు వెల్లువెత్తుతున్నాయి. దీనికితోడు పరిశ్రమల్లో 75 శాతం ఉద్యోగావకాశాలు స్థానికులకు కల్పించాలని ప్రభుత్వం చట్టబద్ధత చేయడం నిరుద్యోగులకు వరంలా మారింది. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నిరుద్యోగులకు నైపుణ్య శిక్షణిచ్చి ఉద్యోగావకాశాలు కల్పిస్తోంది ప్రభుత్వం. దీంతో వేలాది మంది నిరుద్యోగుల కుటుంబాల్లో వెలుగులు నిండుతున్నాయి.



జాబ్‌మేళాకు హాజరైన అభ్యర్థులకు సూచనలిస్తున్న అధికారులు (ఫైల్)

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: రాష్ట్రంలోని నిరుద్యోగ సమస్యను పరిష్కరించే లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రామ సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను ఏర్పాటు చేశారు. వాటి ద్వారా నాలుగేళ్లలో సుమారు 2.5 లక్షల మందికిపైగా ఉద్యోగావకాశాలు కల్పించారు. అలాగే ప్రభుత్వ ఉద్యోగాలకు ఎప్పటికప్పుడు నోటిఫికేషన్లు జారీ చేస్తున్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో యువతకు చదువు ఒక్కటే సరిపోదని, నైపుణ్య శిక్షణలు సైతం ఇచ్చి జాబ్ మేళాల ద్వారా ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నారు.

జాబ్‌మేళాలతో ఉద్యోగావకాశాలు

వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక 2019 నుంచి ఇప్పటి వరకు ఉమ్మడి నెల్లూరు జిల్లాలో మండల, నియోజకవర్గాలు, ప్రత్యేక స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు, డిగ్రీ కళాశాలల్లో సుమారు 78 జాబ్‌మేళాలు నిర్వహించారు. ఆయా జాబ్‌మేళాలకు 13,993 మంది హాజరయ్యారు. ఇప్పటి వరకు 335 ఎంఎన్‌సీ కంపెనీల్లో మంచి ప్యాకేజీతో 4,615 మంది ఉద్యోగావకాశాలు పొందారు.

దివంగత మంత్రి గౌతమ్‌రెడ్డి హయాంలో..

దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి హయాంలో ఆత్మకూరు ప్రాంతంలో ఉద్యోగ విప్లవం జరిగింది. ఆయన మెట్ట ప్రాంతాలైన ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గాల్లో పరిశ్రమల ఆధారిత నైపుణ్య శిక్షణలు ఇప్పించి ఉద్యోగావకాశాలు కల్పించారు. ఆయన మంత్రిగా ఉన్న సమయంలో రెండు దఫాలు ఆత్మకూరులో జాబ్‌మేళాలు నిర్వహించి రెండు వేల మందికి ఉద్యోగాలు ఇప్పించారు.

- 2019 నవంబర్‌లో ఆత్మకూరు పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన తొలి జాబ్‌మేళాకు 1,716 మంది నిరుద్యోగులు హాజరవగా, 424 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. అలాగే 674 మందికి ఒక నెల పాటు నైపుణ్య శిక్షణ అందించి వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు కల్పించారు. వారితో పాటు మరో 213 మందికి దీర్ఘకాలిక శిక్షణ ఇప్పించి వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు కల్పించారు.
- 2020 అక్టోబర్ 30న ఆత్మకూరులోని పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన మరో జాబ్‌మేళాకు 2,437 మంది నిరుద్యోగులు హాజరవగా, 25 కంపెనీలకు 840 మంది ఎంపికయ్యారు.

ఆత్మకూరు ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి చొరవతో..

ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ప్రత్యేక చొరవతో ఆత్మకూరులో ఇప్పటికే రెండు విడతలుగా జాబ్‌మేళాలు నిర్వహించి దాదాపు 300 మందికిపైగా ఉద్యోగావకాశాలు కల్పించారు. వైఎస్సార్ జిల్లా పరిధిలో మర్రిపాడు మండల సమీపంలో ఏర్పాటు చేసిన సెంచూరియన్ కంపెనీ యాజమాన్యాన్ని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ప్రత్యేకంగా కలిసి ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గాల పరిధిలో నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కంపెనీకి అవసరమైన విధంగా నైపుణ్య శిక్షణను అందిస్తామని హామీ ఇచ్చారు. అందుకు కంపెనీ యాజమాన్యం అంగీకరించింది. త్వరలోనే ఆత్మకూరు ప్రాంత నిరుద్యోగులకు ఉద్యోగాలు రానున్నాయి.



నెల్లూరులో నిర్వహించిన జాబ్‌మేళాకు హాజరైన నిరుద్యోగులు (ఫైల్)

నైపుణ్య శిక్షణతో ఉద్యోగావకాశాలు

స్థానిక యువతకు స్థానికంగా ఉండే పరిశ్రమల్లో ఉద్యోగాలు కల్పించాలన్న ప్రభుత్వ ఆదేశాలు మేరకు ఉమ్మడి జిల్లాలోని శ్రీసిటీలో పరిశ్రమల ఆధారిత నైపుణ్య శిక్షణ, ఉపాధి శిక్షణలు ఇచ్చి ఉద్యోగాలు కల్పిస్తున్నాం. ప్రత్యేకంగా జాబ్‌మేళాలు నిర్వహించి ఉద్యోగాలు ఇప్పిస్తున్నాం. నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా ప్రత్యేకంగా శిక్షణ కేంద్రాలు నిర్వహిస్తున్నాం.

– కట్టమంచి విజయ వినీల్‌కుమార్, నైపుణ్య శిక్షణ అధికారి, నెల్లూరు

ఉద్యోగ కల్పన నా బాధ్యత

ఆత్మకూరు ప్రజలు నన్ను ఆదరించి అక్కున చేర్చుకున్నారు. వారికి అన్ని విధాలా సాయం చేయడం నా ధర్మం. ఆత్మకూరు, ఉదయగిరి మెట్టప్రాంత నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించి వారిపై తల్లిదండ్రులు పెట్టుకున్న ఆశలను నెరవేర్చాలనుకున్నా. పరిశ్రమల ఆధారిత నైపుణ్య శిక్షణలు ఇచ్చి వారికి కొలువులు అందేలా చేస్తున్నాం. ఇటీవల సెంచూరియన్ కంపెనీ యాజమాన్యంతో మాట్లాడగా 500 మందికి ఉద్యోగాలు కల్పించేందుకు అంగీకరించారు.

–మేకపాటి విక్రమ్‌రెడ్డి, ఎమ్మెల్యే, ఆత్మకూరు

గణేశ్ నిమజ్జనానికి బైక్‌పై వెళ్తుండగా...



ఘటనా స్థలంలో సాధిక్, అనిల్ మృతదేహాలు

- రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల దుర్మరణం
- మరో యువకుడికి తీవ్రగాయాలు

ఇందుకూరుపేట: గణేశ్ నిమజ్జనానికి బైక్‌పై వెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు దుర్మరణం చెందగా, మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన మండలంలోని పున్నూరు క్రాస్‌రోడ్డు వద్ద గురువారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలు..నెల్లూరు రూరల్ పరిధిలోని మూడో మైలుకు చెందిన బోరి హరికృష్ణ, షేక్ సాధిక్(21), బడ్డి అనిల్(24) స్నేహితులు. వారి వీధిలో వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన గణనాథుడి ప్రతిమను మైపాడు బీచ్‌లో నిమజ్జనం చేసేందుకు గురువారం రాత్రి తరలించారు. ఈ క్రమంలో ముగ్గురు స్నేహితులు బైక్‌పై మైపాడు బీచ్‌కు బయలుదేరారు. మార్గం మధ్యలో పున్నూరు క్రాస్‌రోడ్డు వద్ద ఏం జరిగిందో ఏమో ప్రమాదానికి గురై సాధిక్, అనిల్ అక్కడికక్కడే మృతి చెందారు. మరో స్నేహితుడు హరికృష్ణ తీవ్రంగా గాయపడ్డాడు. హరికృష్ణను చికిత్స నిమిత్తం 108 వాహనంలో నెల్లూరు తరలించారు. కాగా బైక్ అదుపుతప్పి ప్రమాదానికి గురైందా లేదా మరేదైనా వాహనం ఢీకొందా అనే విషయం తెలియరాలేదు. ఇన్‌చార్జి ఎస్సై రంగనాథ్‌గౌడ్ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు ఆరా తీశారు.

సీజనల్ హాస్టళ్లలో అవకతవకలపై విచారణ

- 'సాక్షి' కథనంపై సమగ్ర శిక్ష ప్రాజెక్ట్ డైరెక్టర్ సీరియస్
- విచారణకు నలుగురితో కూడిన కమిటీ ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్..

నెల్లూరు(టౌన్): సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సీజనల్ హాస్టళ్లలో జరుగుతున్న అవకతవకలపై సమగ్రశిక్ష ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాసరావు సీరియస్ అయ్యారు. సీజనల్ హాస్టళ్లలోని అవకతవకలపై 'సాక్షి'లో 'సమగ్రలో పర్యవేక్షణ కరువు' శీర్షికన బుధవారం కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ కథనంపై స్పందించిన స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ విచారణకు ఆదేశించారు. నలుగురు సభ్యులతో కూడిన కమిటీని ఏర్పాటు చేసి సీజనల్ హాస్టళ్లలో జరుగుతున్న అక్రమాలపై సమగ్ర విచారణ చేపట్టి నివేదిక అందజేయాలని ఆదేశించారు. సీజనల్ హాస్టళ్లతో పాటు నాన్ రెసిడెన్షియల్ స్పెషల్ ట్రైనింగ్ సెంటర్లను తనిఖీ చేయాలని సూచించారు. జిల్లాలో మొత్తం 23 సీజనల్ హాస్టళ్లు, 32 నాన్ రెసిడెన్షియల్ స్పెషల్ ట్రైనింగ్ సెంటర్లు ఉన్నాయి. సీజనల్ హాస్టళ్ల అవకతవకలపై విచారణ కమిటీలో సీమ్యాట్ అసోసియేట్ ఫెలో శారదాకుమారి, అసెస్‌మెంట్ సెల్ ప్రొఫెసర్ అపర్ణ, కేజీబీవీ అసిస్టెంట్ డీసీడీఓ ఉష, ఎడ్యుకేషన్ స్టేట్ కోఆర్డినేటర్ భారతిని నియమించారు. ఈ కమిటీ సీజనల్ హాస్టళ్లపై లోతైన విచారణ చేపట్టి అవకతవకలను వెలికితీస్తారా లేక ప్రలోభాలకు లొంగి మిన్నకుంటారా అనేది వేచి చూడాల్సి ఉంది.

అభ్యంతరాలుంటే తెలియజేయండి

- పోలింగ్ కేంద్రాలపై సమీక్షలో రాజకీయ పార్టీలకు కలెక్టర్ సూచన

నెల్లూరు (దర్గామిట్ట): ఓటర్ల జాబితా స్పెషల్ సమ్మర్ రివిజన్‌లో భాగంగా జిల్లాలో పోలింగ్ కేంద్రాల మార్పు, నూతన కేంద్రాల ఏర్పాటు, తదితర అంశాలపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే రాత పూర్వకంగా తెలియజేయాలని కలెక్టర్ ఎం హరినారాయణన్ రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. గురువారం ఉదయం కలెక్టరేట్‌లోని ఎస్సార్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో ఓటర్ల జాబితా స్పెషల్ సమ్మర్ రివిజన్–2024లో భాగంగా ఓటరు నమోదు, మార్పులు, చేర్పులు, అభ్యంతరాలు, పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్, తదితర అంశాలపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ వారాంతపు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ ప్రక్రియపై ఏమైనా సూచనలు ఉంటే సంబంధిత ఈఆర్వోల దృష్టికి తీసుకురావాలని కోరారు. జిల్లాలోని 8 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ప్రస్తుతం 2,303 పోలింగ్ కేంద్రాలు ఉండగా, కొత్తగా 8 పోలింగ్ కేంద్రాలను ప్రతిపాదించామని తెలిపారు. కొత్తగా కందుకూరు 2, కోవూరు 1, నెల్లూరు రూరల్ 3, సర్వేపల్లి నియోజకవర్గంలో 2 చొప్పున ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. జిల్లాలో 1350 మంది ఓటర్లు కలిగిన పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించి అవసరమైతే అదనపు పోలింగ్ కేంద్రం ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాలని ఈఆర్వోలను ఆదేశించారు. జిల్లాలో ఇంటింటి సర్వే ద్వారా పెండింగ్‌లోని ఓటరు క్లెయిమ్‌లు, అభ్యంతరాలను పరిష్కరించి పారదర్శకంగా ఓటర్ల జాబితాను రూపొందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. అందుకు సంబంధించి అభ్యంతరాలు ఉంటే రాతపూర్వకంగా తెలియజేయాలని రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. డీఆర్వో వెంకటనారాయణమ్మ, ఈఆర్వోలు వికాస్ మర్మత్, మలోల, ఓబులేసు, ప్రేమ్‌కుమార్, శోభిక, కరుణకుమారి, శీనానాయక్, రాజకీయ పార్టీల ప్రతినిధులు టీ సురేంద్రబాబు, చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, భువనేశ్వరప్రసాద్, బీ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.




రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్

గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ సర్వేలో మెరుగైన స్థానం

- కలెక్టర్‌కు విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రశంసలు

నెల్లూరు(దర్గామిట్ట): గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో సర్వేలో జిల్లా మెరుగైన స్థానంలో ఉండడంపై విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ జిల్లా కలెక్టర్ హరినారాయణన్‌ను ప్రశంసించారు. గురువారం మధ్యాహ్నం అమరావతి నుంచి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్‌రెడ్డి వివిధ శాఖల ముఖ్య కార్యదర్శులతో కలిసి జిల్లాల కలెక్టర్లతో వర్చువల్ సమావేశం నిర్వహించారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాల్లో భాగంగా మహిళల ఆరోగ్యం, పిల్లల సంక్షేమం, విద్య, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం సరఫరా, మన బడి నాడు నేడు, గడప గడపకు మన ప్రభుత్వం పనుల పురోగతి, జగనన్న ఆరోగ్య సురక్ష, జగనన్నకు చెబుదాం కార్యక్రమాల అమలుపై సమీక్షించి సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశానికి కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణం నుంచి హాజరైన కలెక్టర్ ఎం హరినారాయణన్‌ను గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ సర్వేలో నెల్లూరు జిల్లా మెరుగైన స్థానంలో ఉండడానికి జిల్లా యంత్రాంగం తీసుకున్న చర్యలను వివరించాలని విద్యా శాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్‌ప్రకాష్ కోరారు. ఇందుకు కలెక్టర్ బదులిస్తూ జిల్లాలో 13790 క్లస్టర్లు ఉండగా 9,570 క్లస్టర్లలో వలంటీర్లతో 100 శాతం సర్వే చేపట్టామని తెలిపారు. డీఈఓ పర్యవేక్షణలో ఎంపీడీఓలు, ఎంఈఓలు, సీఆర్పీలకు బాధ్యతలు అప్పగించి సర్వేను పక్కాగా చేపట్టామని వివరించారు. వలస వెళ్లిన, వివాహం చేసుకున్న, నాలుగైదేళ్లుగా పాఠశాలలకు రాకుండా ఉన్న విద్యార్థులను గుర్తించి ఓపెన్ స్కూల్‌లో చేర్పించేలా చర్యలు చేపట్టామన్నారు. పదో తరగతి తప్పిన వారిని గుర్తించి దాతల సాయంతో పరీక్ష ఫీజులు కట్టించి స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ ఇప్పించేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఎంఈఓల ప్రత్యక్ష పర్యవేక్షణలో ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు చైల్డ్ ఇన్‌ఫోలో విద్యార్థుల పూర్తి వివరాలు నమోదు చేసేలా చర్యలు చేపట్టామన్నారు. బడి బయట ఉన్న విద్యార్థులు బడికి వచ్చేలా జిల్లాలో పకడ్బందీగా చర్యలు చేపడుతున్నామని వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జెడ్పీ సీఈఓ చిరంజీవి, డీఆర్డీఏ పీడీ సాంబశివారెడ్డి, డీఈఓ గంగాభవాని, సమగ్ర శిక్ష ఏపీసీ ఉషారాణి, డీఎంహెచ్‌ఓ పెంచలయ్య, డీసీహెచ్‌ఎస్ రమేష్‌నాథ్, ఐసీడీఎస్ పీడీ హేనాసుజన, తదితరులు పాల్గొన్నారు.



కుటుంబ సభ్యులతో సంతోషంగా జీవించాలి



మాట్లాడుతున్న వాణి

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వాణి

వెంకటాచలం: ఖైదీలు జైలు నుంచి విడుదలయ్యాక వివాదాల జోలికి వెళ్లకుండా కుటుంబ సభ్యులతో సంతోషంగా జీవించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కే వాణి సూచించారు. మండలంలోని చెముడుగుంట వద్దనున్న జిల్లా కేంద్ర కారాగారంలో గురువారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ముందుగా జైలులోని ఖైదీలు, వారిని కలిసేందుకు వచ్చిన బంధువులతో మాట్లాడారు. ఏమైనా సమస్యలున్నాయా? అని ఆరాతీశారు. ఖైదీలను కలిసేందుకు సక్రమంగా అనుమతులు ఇస్తున్నారా? లేదా? అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం జడ్జి మాట్లాడుతూ క్షణికావేశంలో తప్పులు చేసి జైలు జీవితం అనుభవిస్తున్న వ్యక్తులు విడుదలయ్యాక సత్ప్రవర్తనతో మెలగాలన్నారు. ఏమైనా సమస్యలు ఉన్నా న్యాయసేవాధికార సంస్థ దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. న్యాయసాయం అవసరమైన వారికి ఉచితంగా అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ ఎస్ సాయి ప్రవీణ్, జైలర్ వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.



క్లుప్తంగా

ఆత్మకూరు తహసీల్దార్ సరెండర్

నెల్లూరు (దర్గామిట్ట): ఆత్మకూరు తహసీల్దార్ లక్ష్మీనరసింహంను సీసీఎల్ఏకు సరెండర్ చేసినట్లు డీఆర్వో వెంకటనారాయణమ్మ తెలిపారు. గురువారం ఆమె తన కార్యాలయంలో మాట్లాడుతూ విధుల పట్ల నిర్లక్ష్యం వహించడంతో క్రమశిక్షణ చర్యల్లో భాగంగా ఆయన్ను సరెండర్ చేసినట్లు వెల్లడించారు.

గుంటూరులో బుచ్చి యువతి ఆత్మహత్య

కోవూరు (బుచ్చిరెడ్డిపాళెం): బుచ్చిరెడ్డిపాళెం హౌస్‌తోటకు చెందిన ఓ యువతి (18) గురువారం గుంటూరులో ఆత్మహత్య చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. హౌస్‌తోటకు చెందిన ఒకరు గుంటూరులో నివాసం ఉంటున్నారు. వారి సిఫార్సు మేరకు హౌస్‌తోటకే చెందిన గిరిజన యువతి పరిమళ (18)ను గుంటూరులోని ఓ ఇంట్లో పనిలో పెట్టుకున్నారు. అక్కడ ఏం జరిగిందో తెలియదు కానీ ఆ యువతి ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సమాచారం అందుకున్న బంధువులు మృతదేహాన్ని బుచ్చిరెడ్డిపాళెం తీసుకొచ్చారు. బాలిక తల్లిదండ్రులు షాద్‌నగర్‌లో ఇటుకబట్టీల్లో పని చేస్తున్నారు. సమాచారం అందుకున్న బుచ్చి ఎస్సై వీరప్రతాప్ వివరాలు సేకరిస్తున్నారు.

బంగారు ఆభరణాల చోరీ

నెల్లూరు(క్రైమ్): కిటికీ దగ్గర పెట్టిన బంగారు ఆభరణాలను గుర్తుతెలియని దుండగుడు అపహరించుకెళ్లాడు. ఈ ఘటన ఎన్టీఆర్ నగర్‌లో గురువారం పట్టపగలు జరిగింది. పోలీసుల కథనం మేరకు.. ఎన్టీఆర్ నగర్‌లో సీహెచ్ మాల కొండయ్య కుటుంబం నివాసం ఉంటోంది. ఆయన గురువారం తన ఏడు సవర్ల బంగారు గొలుసు, ఉంగరాలను కిటికీ వద్ద పెట్టి స్నానం చేసేందుకు బాత్‌రూమ్‌కు వెళ్లాడు. భార్య పని నిమిత్తం ఇంట్లో నుంచి బయటకు వెళ్లారు. ఈ క్రమంలో గుర్తుతెలియని దుండగుడు ఇంట్లోకి ప్రవేశించి బంగారు ఆభరణాలను అపహరించుకెళ్లాడు. స్నానం చేసి బయటకు వచ్చిచూడగా బంగారు ఆభరణాలు కనిపించలేదు. దీంతో బాధితుడు బాలాజీ నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై సుమన్ ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 130
లేయర్ (లైవ్)	: 113
బ్రాయిలర్ చికెన్	: 226
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 250
లేయర్ చికెన్	: 192



నిమ్మధరలు (కిలో)




పెద్దవి	: రూ.70
సన్నవి	: రూ.40
పండ్లు	: రూ.10

రీ సర్వే చేపట్టడం అభినందనీయం

• అసెంబ్లీలో కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట

కందుకూరు: 'భూముల రీ సర్వే చేపట్టడం అభినందనీయం. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారు.' అని కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి ప్రశంసించారు. గురువారం ప్రారంభమైన అసెంబ్లీ సమావేశాల్లో ఆయన మాట్లాడారు. రీ సర్వేలో ప్రస్తుతం ఎవరైతే భూములు కలిగి ఉన్నారో వారి పేరునే కొనసాగించాలని, వారినే శాశ్వత హక్కుదారులుగా కొనసాగించేందుకు రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకుంటున్నారన్నారు. కందుకూరు ప్రాంతంలో యానాదులకు భూములు ఇచ్చారన్నారు. వారు వలసలు వెళ్లడంతో ఆ భూములను కొందరు ఆక్రమించుకున్నారని తెలిపారు. ఈ ఆక్రమణదారులకు పలువురు రెవెన్యూ అధికారులు కొమ్ముకాస్తూ రికార్డుల్లో పేర్లు నమోదు చేశారని వివరించారు. దీనిపై క్షేత్రస్థాయి అధికారులకు స్పష్టమైన సూచనలు ఇవ్వాలన్నారు. అలాగే నిషేధిత జాబితాలో ఉన్న వాగులు, వంకలు, పోరంబోకు భూములను కొందరు అధికారులు సబ్ డివిజన్లు చేసి రికార్డులో నమోదు చేశారన్నారు. వీటిపై తగిన ఆదేశాలు ఇవ్వాలని కోరారు. కందుకూరు మున్సిపాలిటీ పరిధిలోని వెంకటాద్రిపాళెం గ్రామస్తులు సర్వే నంబర్ 116లో 999 ఎకరాల భూములను రైతులు సాగు చేసుకుంటున్నారన్నారు. వాటికి సంబంధించి శాశ్వత హక్కులు కల్పించాలని ఎమ్మెల్యే కోరారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి

కావలి – తుమ్మలపెంట రోడ్డు పనులు చేపట్టాలి

• అసెంబ్లీలో కోరిన ఎమ్మెల్యే రామిరెడ్డి

కావలి: 'కావలి నియోజకవర్గంలో 47 కిలోమీటర్ల సముద్ర తీర ప్రాంతం ఉంది. తీరం వెంబడి ఉన్న గ్రామాలకు రాకపోకలు సాగించడానికి ప్రధాన రహదారి కావలి – తుమ్మలపెంట రోడ్డు. ఈ పనులు చేపట్టాలి.' అని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి కోరారు. నియోజకవర్గంలోని ప్రధానమైన సమస్యలను ఎమ్మెల్యే గురువారం అసెంబ్లీలో వివరించి పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలో ట్రంక్‌రోడ్డు విస్తరణకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.55 కోట్లు నిధులు మంజూరు చేశారన్నారు. ఈ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కావలి పట్టణంలోని పెద్ద చెరువును బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌గా అభివృద్ధి చేయడానికి నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. పట్టణంలోని పెద్దపవని రోడ్డులో రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు మొదలుపెట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ నిర్మాణ పనులు 90 శాతం పూర్తయ్యాయని, మిగిలిన 10 శాతం పూర్తి చేస్తే నియోజకవర్గంలో 15,000 మంది మత్స్యకారులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. సీఎం చేతుల మీదుగా హార్బర్‌ను ప్రారంభింపజేస్తామని తెలిపారు. ఎమ్మెల్యే ప్రస్తావించిన సమస్యలను మంత్రులకు తెలియజేస్తానని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చెప్పారు.



మాట్లాడుతున్న ప్రతాప్‌కుమార్‌రెడ్డి

పేదల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

• ఉదయగిరి సమన్వయకర్త రాజగోపాల్‌రెడ్డి

కొండాపురం: పేదలు ఆర్థికంగా అభివృద్ధి చెందడమే లక్ష్యంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని వైఎస్సార్‌సీపీ ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. మండలంలోని గరిమెనపెంట పంచాయతీలో గురువారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అధికారులు, నాయకులతో కలిసి ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరించి బుక్‌లెట్లను లబ్ధిదారులకు అందజేశారు. స్థానికులు పలు సమస్యలను రాజగోపాల్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంకల్పయాత్రలో ఇచ్చిన హామీలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెరవేర్చినట్లు తెలిపారు. జగనన్న కాలనీలు, అమ్మఒడి, రైతు భరోసా, పింఛన్లు, చేయూత, విద్యా దీవెన, వసతి దీవెన తదితర పథకాలతో ప్రజలకు లబ్ధి చేకూర్చినట్లు చెప్పారు. ఆర్బీకేల ద్వారా రైతులకు సేవలు అందుతున్నాయన్నారు. నాడు – నేడు ద్వారా ప్రభుత్వ బడుల రూపురేఖలు మారినట్లు తెలిపారు. ఉదయగిరి నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు వివరించారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్ కేసులో చంద్రబాబును అరెస్ట్ చేస్తే టీడీపీ నాయకులు ఇష్టానుసారం మాట్లాడడం దారుణమన్నారు. రానున్న ఎన్నికల్లోనూ వైఎస్ జగన్‌ను ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ బొడ్డు అనురాధ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చిమ్మిలి రవీంద్ర, గుడవళ్లూరు సొసైటీ అధ్యక్షుడు కర్తం శ్రీనివాసులురెడ్డి, జేసీఎస్ కన్వీనర్ యారం నరసింహారావు, మాజీ కన్వీనర్ చిమ్మిలి రాజేంద్రప్రసాద్ వైఎస్సార్‌సీపీ నాయకులు పరుచూరి మాల్యాద్రి, వేమిరెడ్డి మల్లికార్జున, యారం వెంకటేశ్వర్లు, షేక్ అహ్మద్ శ్రీను, వెంకట్రావ్, బొడ్డు మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

మనుబోలు: మండలంలోని వీరంపల్లి గ్రామంలో వినాయక చవితి వేడుకల్లో విషాదం చోటుచేసుకుంది. విద్యుత్ షాక్‌తో ఓ వ్యక్తి మృతిచెందాడు. గ్రామస్తులు, పోలీసుల కథనం మేరకు.. వినాయక చవితి సందర్భంగా గ్రామంలో విగ్రహాన్ని ఏర్పాటు చేసి రోజూ పూజలు చేస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం రాత్రి నలగర్ల పవన్ కుమార్ (30) అనే వ్యక్తి ప్రసాదాలు తీసుకోవాలని మైక్‌లో చెబుతున్నాడు. ఈ సమయంలో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. దీంతో గ్రామంలో విషాదం నెలకొంది. పవన్‌కు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు గురువారం తెలిపారు.



పవన్ కుమార్ మృతదేహం

'జగనన్నకు చెబుదాం'కు విశేష స్పందన

• ధాన్యం కొనుగోలుకు సిద్ధం
• జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్



నెల్లూరు(దర్గామిట్ట): మండల కేంద్రాల్లో నిర్వహిస్తున్న జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోందని జాయింట్ కలెక్టర్ రోణంకి కూర్మనాథ్ తెలిపారు. నెల్లూరులోని తన కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కలెక్టర్ అధ్యక్షతన అన్ని శాఖల జిల్లాస్థాయి అధికారులతో కలిసి నిర్వహిస్తున్న జగనన్నకు చెబుదాంలో రెవెన్యూ సమస్యలే కాకుండా పలు అభివృద్ధి పనులకు సంబంధించి ప్రజల నుంచి అర్జీలు వస్తున్నాయన్నారు. వాటిని సంబంధిత అధికారులకు అందజేస్తున్నట్లు వెల్లడించారు. ఆత్మకూరు, దగదర్తి, రాపూరు, ఇందుకూరుపేట మండల కేంద్రాల్లో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు చెప్పారు. జిల్లాలో ఈనాం భూములను 186 గ్రామాల్లో గుర్తించామన్నారు. వాటికి సంబంధించి నివేదిక సిద్ధం చేస్తున్నామన్నారు. 577 గ్రామాల్లో పేదల అసైన్‌మెంట్ భూములను గుర్తించామని, ఈ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. ఈనాం, అసైన్‌మెంట్ భూములపై పేదలకు సర్వ హక్కులు కల్పించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం శుభపరిణామమన్నారు.

ఆంక్షలు లేవు

ధాన్యం అమ్మకాలపై రైతులకు ఎటువంటి ఆంక్షలు లేవని జేసీ తెలిపారు. రైతులు ఎక్కడైనా అమ్ముకోవచ్చన్నారు. వ్యాపారులు, మిల్లర్లు ధాన్యం కొనుగోలు చేయొచ్చని స్పష్టం చేశారు. జిల్లాలో ప్రస్తుతం ఎడగారు సీజన్‌కు సంబంధించి 1.5 లక్షల ఎకరాల్లో సాగు చేశారని, సుమారు 5 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. కేఎన్‌యూ 1638, కేఎన్‌యూ 733, బీపీటీ, ఏటీయూ 1010, ఎన్ఎల్ఆర్ 34449 రకాల ధాన్యాన్ని సాగు చేసినట్లు చెప్పారు. ప్రభుత్వం ఆదేశాల ప్రకారం ఏ గ్రేడ్ రకం పుట్టి రూ.17,500, సాధారణ రకం రూ.17,034కు కొనుగోలు చేయాలన్నారు. రైతులకు ప్రభుత్వం నిర్దేశించిన ధర కల్పించేందుకు అవసరమైన కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఏటీయూ 1010 మినహా అన్ని రకాల ధాన్యాలను ఆయా కేంద్రాల ద్వారా కొనుగోలు చేస్తారన్నారు. కొడవలూరు, విడవలూరు, కలువాయి, అనంతసాగరం తదితర ప్రాంతాల్లో కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

ఎస్‌జీఎఫ్ క్రీడల షెడ్యూల్ విడుదల

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): ఉమ్మడి నెల్లూరు జిల్లా ఎస్‌జీఎఫ్ (స్కూల్ గేమ్స్ ఫెడరేషన్) అండర్ –19 క్రీడా షెడ్యూల్‌ను గురువారం నెల్లూరు కేఏసీ కళాశాలలో ఉన్న డీవీఈఓ కార్యాలయంలో డీవీఈఓ కె.మధుబాబు, ఆర్ఐఓ డాక్టర్ ఎ.శ్రీనివాసులు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 25న ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో వాలీబాల్, వెయిట్ లిఫ్టింగ్, బాస్కెట్‌బాల్, బాక్సింగ్, రెజ్లింగ్, స్విమ్మింగ్, ఫెన్సింగ్, బ్యాడ్మింటన్, త్రోబాల్ పోటీలు జరుగుతాయన్నారు. 26న స్టేడియంలోనే ఖోఖో, హాకీ, సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్, టేబుల్ టెన్నిస్, 27న డీకేడబ్ల్యూ కళాశాల, చిల్లకూరు గురుకులంలో చెస్, హ్యాండ్‌బాల్, బాల్ బ్యాడ్మింటన్, టెన్ని కాయిట్ పోటీలు నిర్వహిస్తారన్నారు. 29న ఏసీ స్టేడియంలో సెపక్‌తక్రా, నెట్‌బాల్, టెన్నిస్, అక్టోబర్ 2న స్టేడియంలోనే క్రికెట్, తైక్వాండో, యోగా, ఫుట్‌బాల్, కబడ్డీ, ఆర్చరీ, రోప్ స్కిప్, సెపక్‌తక్రా, 3న స్టేడియంలో రగ్బీ, జూడో, జిమ్నాస్టిక్స్, సాఫ్ట్ టెన్నిస్, చిల్డ్రన్స్ పార్క్‌లో స్కేటింగ్ పోటీలు జరుగుతాయన్నారు. క్రీడాకారులు పదో తరగతి మార్క్స్ మెమో లేదా జనన ధ్రువీకరణపత్రం తీసుకురావాలని తెలిపారు. ఫారం–3లో ప్రిన్సిపల్ మరియు, పీడీ, సంతకాలతో హాజరుకావాలన్నారు. ఇతర వివరాలకు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి, పీడీ డి.శ్రీరేష్ ఫోన్ నంబర్ 97048 27095ను సంప్రదించాలన్నారు.



షెడ్యూల్‌ను ప్రదర్శిస్తున్న అధికారులు

బ్యాటరీ పేలి అగ్ని ప్రమాదం

• మూడు ద్విచక్ర వాహనాలు, ఏసీ దగ్ధం

నెల్లూరు(క్రైమ్): ఎలక్ట్రిక్ స్కూటర్ బ్యాటరీ పేలి అగ్ని ప్రమాదం జరిగింది. ఆ వాహనంతోపాటు పక్కనున్న మరో రెండు మోటార్‌బైక్‌లకు మంటలు వ్యాపించి దగ్ధమైన ఘటన నెల్లూరు కళ్యాణ్ నగర్‌లో గురువారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. కళ్యాణ్ నగర్ నాలుగో వీధిలో కె.తిరుపతిరెడ్డికి రెండు అంతస్తుల బిల్డింగ్ ఉంది. ఒక పోర్షన్‌లో ఆయన నివాసం ఉంటుండగా మిగిలిన వాటిని అద్దెకు ఇచ్చాడు. తిరుపతిరెడ్డికి ఓ ప్రముఖ కంపెనీకి చెందిన ఎలక్ట్రిక్ స్కూటర్ ఉండగా మిగిలిన వారికి వివిధ కంపెనీలకు చెందిన బైక్‌లున్నాయి. అందరూ గ్రౌండ్ ఫ్లోర్‌లో వాటిని పార్క్ చేస్తారు. గురువారం తెల్లవారుజామున ఎలక్ట్రిక్ స్కూటర్ బ్యాటరీ పేలింది. ఈ నేపథ్యంలో మంటలు పక్కనున్న రెండు ద్విచక్ర వాహనాలకు, గ్రౌండ్ ఫ్లోర్‌లోని గదికి వ్యాపించాయి. ఈ విషయాన్ని గమనించిన పక్కింటి వారు తిరుపతిరెడ్డికి ఫోన్ చేసి సమాచారం అందించారు. ఆయన అగ్నిమాపక సిబ్బంది దృష్టికి తీసుకెళ్లగా వారు ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో ఎలక్ట్రిక్ వాహనంతోపాటు రెండు మోటార్‌బైక్‌లు, ఫర్నిచర్, ఏసీలు కాలిపోయాయి. బాధితుడు వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రూ.10 లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపారు.

ఆర్టీసీ కండక్టర్‌కు అస్వస్థత

• వేరే బస్సులో ప్రయాణికుల తరలింపు

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): ఆర్టీసీ బస్సులో విధి నిర్వహణలో ఉన్న కండక్టర్ రామకృష్ణ అవస్థతకు గురయ్యాడు. దీంతో ప్రయాణికులను వేరే బస్సులో తరలించారు. ఈ ఘటన మర్రిపాడు మండలం నందవరం మోడల్ స్కూల్ సమీపంలో గురువారం సాయంత్రం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. డ్రైవర్ మున్వర్‌బాషా, కండక్టర్ రామకృష్ణ బస్సులో ప్రయాణికులను ఎక్కించుకుని ఆత్మకూరు నుంచి ఉదయగిరి వైపు వెళ్తున్నారు. ఈ క్రమంలో మోడల్ స్కూల్ సమీపంలో ఒక్కసారిగా రామకృష్ణ ఛాతినొప్పిగా ఉందని చెప్పాడు. డ్రైవర్ వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించాడు. వారు వచ్చి బాధితుడిని చికిత్స నిమిత్తం ఆత్మకూరుకు తరలించారు. ప్రయాణికులను వేరే బస్సులో గమ్యస్థానాలకు చేర్చారు. రామకృష్ణ ఆరోగ్యం నిలకడగా ఉందని ఆర్టీసీ వర్గాలు తెలిపాయి.



108లో కండక్టర్‌ను ఆత్మకూరుకు తరలిస్తున్న దృశ్యం